నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, గురువారం 15 మే 2025 SIDDIPET

# క్రీ‘డల్’..



సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో బోర్డుకు పరిమితమైన క్రీడాప్రాంగణం

బీఆర్ఎస్ ప్రభుత్వం ఊరూరా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక క్రీడా ప్రాంగణాల నిర్వహణను విస్మరించింది. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధి, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు గత సీఎం కేసీఆర్ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు బోర్డులకు పరిమితమయ్యాయి. క్రీడా పరికరాలు లేక, క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే వాళ్లు లేక క్రీడాకారులు ఇటువైపు రావడం లేదు. వీటి నిర్వహణను పట్టించుకోవాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణ క్రీడాకారులు, యువత ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

– నిజాంపేట్, మే 14


హవేళీఘనపూర్ మండలం దూప్‌సింగ్ తండాలో బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బంజారా నాయకులు

## తండాలను జీపీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే..

### బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మే 14: రాష్ట్రంలో గిరిజన తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత గత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం దూప్‌సింగ్ తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అన్నారు. సేవాలాల్ ఆలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు బంజారాలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గిరిజన తండా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా కేసీఆర్ తీర్చిదిద్దారని గుర్తుచేశారు. తండాలు పంచాయతీలుగా ఏర్పాటు కావడంతో అభివృద్ధికి తోడ్పడుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో పంచాయతీలు అభివృద్ధికి దూరమవుతున్నయని విమర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పద్మాదేవేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాయగౌడ్, సాయిలు, భిక్షపతిరెడ్డి, సాప సాయులు, బాలరాజు, మల్లయ్య, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షల ఊసేలేదు !

- గజ్వేల్‌లో అలంకారప్రాయంగా భూసార పరీక్ష కేంద్రం
- బీఆర్ఎస్ హయాంలో రూ.81.20 లక్షలతో ఏర్పాటు
- పరీక్ష కేంద్రానికి సిబ్బంది, పరికరాలు అందించని కాంగ్రెస్ ప్రభుత్వం
- నిరుపయోగంగా భవనం
- పెదవి విరుస్తున్న రైతులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిరూపయోగంగా భూసార పరీక్ష కేంద్రం

గజ్వేల్, మే 14: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన భూసార పరీక్ష కేంద్రం అలంకారపాయంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం నియోపయోగంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపక పోవడంతో భూసార పరీక్ష కేంద్రం ఉన్నా రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు. వర్షాకాలం సీజన్‌కు ముందు వ్యవసాయ భూముల్లో మట్టి పరీక్షలు చేసి రైతులకు ఎరువుల వాడకంపై అధికారులు తగు సలహాలు, సూచనలు చేయాల్సి ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.81.20 లక్షలతో భూసార పరీక్ష కేంద్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిని 2023లో ప్రారంభించారు. ప్రారంభించిన తరువాత కొద్ది నెలల్లోనే ఎన్నికలు రావడంతో అప్పట్లో భూసార పరీక్ష కేంద్రానికి సరిపడా పరికరాలు సమకూర్చ లేకపోయారు. భూసార పరీక్ష కేంద్రంలో పరికరాలతో పాటు సిబ్బందిని నియమించాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భూసార పరీక్ష కేంద్రంలో ఇప్పటి వరకు ఎలాంటి భూసార పరీక్షలు చేయలేకపోయారు. గజ్వేల్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి ఏడీఏతో పాటు ఏవోలు, ఏఈవోలు, ల్యాబ్ అసిస్టెంట్లు, అటెండర్లను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఒక్కటే భూసార పరీక్ష కేంద్రం రైతులకు అందుబాటులో ఉంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రైతులు మట్టిని అక్కడికి తీసుకెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. దీంతో దూరభారంతో పాటు ఆలస్యం జరుగుతున్నది. చాలామంది రైతులు భూసార పరీక్షలకు ముందుకు రావడం లేదు.

### భూసార పరీక్షలతో రైతులకు మేలు...

భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుంది. రైతులు సాగుచేసే భూమిలో మట్టి పరీక్షలు చేసి సాగు భూమికి అనుగుణంగా పంటలతో పాటు అవసరమైన మేర ఎరువులను వేసుకునే వెసులుబాటు ఉంటుంది. భూసార పరీలు చేయకపోవడంతో రైతులు ఇష్టానుసారంగా ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. అదే విధంగా ఒకే రకమైన పంటలను సాగు చేయడంతో సరైన దిగుబడి రాక అనేక రకాలుగా నష్టాలకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 6లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. నేల స్వభావం తెలియక రైతులు ఇష్టానుసారంగా ఎరువుల వాడడంతో దిగుబడులు తగ్గడం, పెరగడం నేల స్వభావాన్ని కోల్పోవడంతో పాటు రైతులపై ఆర్థిక భారం పడుతుంది. అదే భూసార పరీక్షలు ఏటా నిర్వహిస్తే పోషక లోపాలను గుర్తించి అవసరమైన మేరకు ఎరువులను వినియోగించే అవకాశాలు ఉంటా యి. తద్వారా రైతులకు మేలు చేసిన వారవుతారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి భూసార పరీక్ష కేంద్రా ల్లో అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

### విభిన్న పంటల సాగు...

గజ్వేల్ నియోజకవర్గ రైతులు వరి, మొక్కజొన్న, వేరుశనగతోపాటు కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు. పలురకాల పూలు సాగుచేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు పండించిన కూరగాయలను వంటిమామిడి మార్కెట్‌కు తరలిస్తుంటారు. మార్కెట్ కూరగాయల విక్రయాలకు చాలా ఫేమస్. వంటిమామిడి మార్కెట్ నుంచి నిత్యం హైదరాబాద్ తదితర ప్రాం తాలకు కూరగాయలు ఎగుమతి చేస్తుంటారు. చాలామంది వ్యాపారులు వంటిమామిడి మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తీసుకెళ్లి అమ్ముతుంటారు. వంటిమామిడి మార్కెట్ నుంచి స్వీట్‌కార్న్ కొనుగోలు చేసుకెళ్లి మెదక్, మేడ్చల్–రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో చిరువ్యాపారులు విక్రయించి ఉపాధి పొందుతుంటారు. పంటల సాగులో ముందున్న గజ్వేల్ ప్రాంత రైతుల మేలు కోరి వెంటనే గజ్వేల్‌లో భూసార పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

# దొంగల ముఠా అరెస్ట్


సంగారెడ్డిలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

- 29 తులాల బంగారం, 18 తులాల వెండి, రూ.4లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్

కంది, మే 14: వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలముఠాను అరెస్టు చేసినట్లు సంగారెడ్డి డీఎస్సీ సత్తయ్యగౌడ్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ఒకే కుటుంబానికి చెందిన నిందితులు జల్సాలకు అలవాటు పడి తప్పుడు మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలని తాళం వేసిన ఇండ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట్‌లో నివాసముంటున్న నిందితులు మార్ల యాదగిరి, మార్ల అనిత, వీరి కుమారుడు మైనర్‌తో పాటు ముస్లాపూర్‌కు చెందిన తలారి లక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బుధవారం ఉదయం సంగారెడ్డి బైపాస్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఏపీ 23 టీఏ 0092 ఆటోను ఆపే క్రమంలో అందులో ఉన్న ఈ నలుగురు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. వీరిని వెంబడించి పట్టుకొని విచారణ చేపట్టారు. సంగారెడ్డి రూరల్, హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు దొంగతనాలకు పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించారన్నారు. నిందితుల నుంచి 29తులాల బంగారు ఆభరణాలు, 18తులాల వెం డి, రూ. 4లక్షల నగదు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నిందితుడు యాదగిరి పాత నేరస్తుడ అని, ఇతనిపై సుమారు 50కి పైగా దొంగతనాల కేసులు ఉన్నాయని తెలిపారు. గతంలో ఇతరులతో చోరీలకు పాల్పడే వాడని, ప్రస్తుతం కుటుంబ సభ్యులతో కలిసి నేరాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో రూరల్ సీఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


చల్మెడలో బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

నిజాంపేట, మే 14: ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో పాటు, ధాన్యం కొనుగోలు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మెదక్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. చల్మెడలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు బుధవారం నిర్వహించిన అమ్మవారి బోనాల ఊరేగింపు కార్యక్రమానికి పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి హాజరై అమ్మవారి బోనం ఎత్తారు. ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు సంఘం సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రామాయంపేట, నిజాంపేట పీఏసీఎస్ చైర్మన్లు చంద్రం, బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, వెంటకస్వామి, మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌అజీజ్, నాయకులు లక్ష్మణ్, వెంకటస్వామిగౌడ్, రంజిత్‌గౌడ్, నరేందర్, మోహన్‌రెడ్డి పాన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో అటెండర్ ఆత్మహత్య


రామకృష్ణ(ఫైల్)

తూప్రాన్, మే 14: మెదక్ జిల్లా తూప్రాన్‌లో చెందిన ఇరిగేషన్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం..తూప్రాన్ పట్టణానికి చెందిన మోడబోయిన రామకృష్ణ (35) పదేండ్లుగా రంగనాయక్ సాగర్ ప్రాజెక్టులో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గతంలో అతను తన వేతనంపై రుణం తీసుకున్నాడు. ఆరు నెలలుగా వేతనాలు పూర్తిగా లోన్లకే కట్ అవుతున్నాయి. ఆరు నెలలుగా ఇంటికి జీతం తీసుకురాకపోవడంతో రామకృష్ణ భార్య లిఖిత, తల్లి కలిసి అధికారులను కలిసి వివరాలు ఆరాతీశారు. రామకృష్ణ లోన్ తీసుకున్నాడు కాబట్టి శాలరీ మొత్తం లోన్‌కే కట్ అవుతుందని అధికారులు వారికి తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 13న వడియారంలోని తన పెద్దమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈనెల 14న ఉదయం 9గంటలకు ప్రైవేటు కంపెనీకి వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం 12.30 గంటలకు జ్వరం వచ్చిందని ఇంటికి వచ్చి వాళ్ల అమ్మతో చెప్పి బెడ్‌రూంలోకి వెళ్లి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిలిచినా పలకకపోవడంతో డోర్లు పగులగొట్టి చూడగా రామకృష్ణ చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. బంధువుల సహాయంతో రామకృష్ణను కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

## పిడుగుపడి ఇద్దరి మృతి



సాబేర్, ఎడ్ల రత్నమ్మ (ఫైల్)

జహీరాబాద్, మే 14: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్ గ్రామానికి చెందిన సాబేర్(15) అనే యువకుడు పిడుగుపాటుకు మృతి చెందాడు. బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మల్గి ఇస్మాయిల్ కుమారుడైన సాబేర్ వర్షం కురుస్తున్న సమయంలో చెట్టుకింద ఉండగా పిడుగు పడడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదే సమయంలో కుటుంబ సభ్యులకు తృటిలో ప్రాణాపాయం తప్పింది.

**నాగిరెడ్డిపల్లిలో మహిళ..**

కోహీర్, మే14: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో పిడుగు పాటుకు మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఎడ్ల రత్న మ్మ(61) పొలానికి వెళ్లింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఇంతలో ఆమెపై ఒక్కసారిగా పిడుగు పడడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. రైతులు వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, రత్నమ్మ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు.

# వాగు మాయం..!

### కొండాపూర్ మండలం గంగారంలో జంగంమోని వోడుక వాగు కబ్జా


గంగారంలో కాలువ పూడ్చివేసి సన్నగా సీసీ వేస్తున్న నిర్వాహకులు


బండ రాళ్లను వాగులోకి తోసేసిన వైనం

- వాగును ఆక్రమించి నిర్మాణ పనులు
- వాగును పూర్తిగా రాళ్లతో నింపిన వెంచర్ నిర్వాహకులు
- చోద్యం చూస్తున్న అధికారులు..
- వత్తాసు పలుకుతున్న నాయకులు..?

కొండాపూర్, మే 14: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో చెరువులు, కాలువలు, వాగులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొం దరు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో రియల్టర్లు కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొండాపూర్ మండలంలోని గంగారం గ్రామంలో నూతనంగా ఒక వెంచర్ ఏర్పాటు చేసేందుకు అక్రమాలకు తెరలేపినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ వెంచర్‌కు అనుకుని ఉన్న 200 మీటర్ల నాలాను కింద ఉన్న రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ దాదాపు 100 మీటర్లకు పైనే పూర్తిగా పూడ్చివేశారు. చాలా ఏండ్ల నుంచి ఈ వాగు కాలువ రైతులకు ఉపయోగపడుతున్నది. ఈ వాగును ఆనుకుని ఉన్న సర్వేనంబర్ 16, 17లో దాదాపు 11 ఎకరాల్లో వెంచర్ నిర్మాణానికి రియల్టర్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ కాలువను పూడ్చివేస్తుండడంతో వర్షం కురిస్తే వాననీరు పోవడానికి ఇబ్బందులు తప్పవు. ఎలాంటి ఇరిగేషన్ అనుమతులు లేకుండా నాలాను పూడ్చి వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాగును పెద్ద పెద్ద బండరాళ్లతో నింపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. వెంచర్ యాజమాన్యం కాలువ, వాగు పూడ్చివేసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నదని ఆరోపించారు. జంగమోని ఓడుక నుంచి కిం దికి వచ్చే నీటికి బ్రిడ్జిలు, వంతెనల నిర్మాణం చేపడుతున్నారు. పిల్ల కాలువలను కూడా మూసివేసి నీటి వనరులను కబ్జా చేసినా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తున్నది. ఇరిగేషన్ కాలువలను సైతం ఆక్రమించారంటూ గంగారం గ్రామ రైతులు, గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే ఇరిగేషన్ అధికారులు చూసుకుంటారని, వారికే తాము సమాధానం చెబుతామంటూ వెంచర్ యాజమాన్యం చెబుతున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత కొండాపూర్ మండల అధికారులను వివరణ కోర గా..ఒకరిపై ఒకరు సమాధానం దాటవేశారు.

#### కాలువను పూడ్చేస్తున్నారు..



కాలువను పూడ్చివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ కాలువపై 300 మీటర్ల వరకు సీసీ నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు 200 మీటర్లు ఉన్న నాలాపై 100 మీటర్ల మేరకు నాలాను పూర్తిగా పూడ్చివేశారు. నాలాపై ఎలాంటి పనులు చేయొద్దని ఎన్ని సార్లు చెప్పినా లెక్కచేయకుండా పనులు చేస్తున్నా రు. వాగులో పెద్ద పెద్ద బండలు వేసి కాలువ నిర్మాణ పనులు చేస్తున్నారు. కాలువ, నాలా పూర్వస్థితికి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.గోపాల్, గంగారం గ్రామస్తుడు

## ఉష్ణతాపం... ఉపశమన మార్గం



చెరుకు రసం తీస్తున్న వ్యాపారి


నిమ్మరసం తాగుతూ..


ఎండలో గొడుగుతో చిన్నారి


జ్యూస్ తాగుతున్న మహిళ

ఎండలు మండిపోతున్నాయి. అసలు మే కావడంతో రోళ్లు పగిలేలా ఎండలు కొడుతున్నాయి. ఉదయం 11 గంటల నుంచే భానుడు సుర్రుమంటున్నాడు. ఎండల దాటికి మధ్యాహ్నం కాగానే రోడ్లన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు జ్యూస్‌లు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, సోడా వంటివి తాగుతున్నారు. పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లేవారు నెత్తిన టోపీలు ధరిస్తున్నారు.కాటన్ తువ్వాలు రక్షణగా ఉపయోగిస్తున్నారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా, మే 14



కొబ్బరి నీళ్లు, మజ్జిగ తీస్తున్న వ్యాపారులు


కొబ్బరి నీళ్లు తాగుతూ...


జిన్నారం, మే 14: మండలకేంద్రం సమీపంలోని శివాలయం గుట్టపై శివుడి విగ్రహం ధ్వంసమైన ఘటనకు సంబంధించి 30 మంది గ్రామస్తులపై కేసులు నమోదై జైలుకెళ్లిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం జైలు నుంచి విడుదలైన గ్రామస్తులు బుధవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ప్రభాకర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కేసుకు సంబంధించి గ్రామస్తులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భరోసానిచ్చారు.

# రహదారులకు ఇక మహర్దశ

- 43 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.81.35 కోట్ల నిధులు మంజూరు
- రాజీవ్‌పార్కు అభివృద్ధికి రూ.12కోట్లు
- సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం


నాలుగు లైన్లుగా విస్తరణ కానున్న బైపాస్ రోడ్డు

సంగారెడ్డి, మే 14 :సంగారెడ్డి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇటీవల వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆయా పనులకు అధికారికంగా భూమిపూజ చేసి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డు ప్రభుత్వ అతిథిగృహం నుంచి బసవేశ్వర విగ్రహం వరకు 2.6 కిలోమీటర్ల రోడ్డును విస్తరించి నాలుగు లైన్లు నాలుగు జంక్షన్లతో అభివృద్ధి చేయనున్నారు. పోతిరెడ్డిపల్లి రైతువేదిక 65వ జాతీయ రహదారి నుంచి శిల్ప వెంచర్ వెనుక నుంచి కంది మండలం కలివేముల భూలక్ష్మమ్మ ఆలయం వరకు 60ఫీట్ల వెడల్పుతో కొత్త రోడ్డును నిర్మించనున్నారు. దీంతోపాటు ఆర్‌అండ్‌బీ శాఖలో 15 కిలోమీటర్ల రెండు రోడ్లకు రూ.30కోట్ల, పంచాయతీరాజ్ విభాగంలో 6 రోడ్లు 26.3కిలోమీటర్ల రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.81.3 కోట్లు నిధులు మంజూరైనట్లు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కృషిచేస్తున్నారు.

### రాజీవ్‌పార్కుకు రూ.12 కోట్లు..

సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్‌పార్కు అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.12కోట్లను మంజూరు చేసింది. త్వరలో నిర్మాణ పనులకు టెండర్లకు శ్రీకారం చుట్టనున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖలో కొండాపూర్ మండలం మల్లేపల్లి నుంచి వయా చెర్ల గోపులారం చెరువు కట్ట వెడల్పుతోపాటు తేర్పోల్, హరిదాస్‌పూర్ వరకు 7 కిలోమీటర్ల రోడ్డును డబుల్ లైన్‌గా మార్చడానికి రూ.15కోట్లు మంజూరయ్యాయి. సదాశివపేట మండలం తంగేడుపలి–మల్లారెడ్డిపేట్ రోడ్, వయి మద్దికుంట, ఆత్మకూర్ వరకు 8 కిలో మీటర్ల రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు రూ.15కోట్ల నిధులు ఖర్చు చేయనున్నారు.

### పీఆర్‌లో 26.3 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి...

సంగారెడ్డి నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ విభాగంలో కొనసాగుతున్న రోడ్లను అభివృద్ధి చేసేందుకు 26.3కిలోమీటర్ల రోడ్లకు రూ.22.85 కోట్లను ఖర్చుచేయనున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రయను అధికారులు చేపట్టినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు. కొండాపూర్ మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వయా ఆలియాబాద్– గారకుర్తి గ్రామాల నుంచి సదాశివపేట వరకు 9కిలోమీటర్ల రోడ్డుకు రూ.10కోట్లతో చేపట్టనున్నారు. కంది మండలం కలివేముల నుంచి మక్తఅల్లూరు వరకు 2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.80కోట్లు నిధులు మంజూరయ్యాయి. అదే మండలంలోని చిమ్నాపూర్ నుంచి చిమ్నాపూర్ తండా వరకు 2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.34కోట్లు, బైపాస్ రోడ్డు నుంచి మహమ్మద్ షాపూర్ తండా వరకు 2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.85కోట్లు, కొండాపూర్ మండలం మారేపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వయా రామ్‌పూర్ తండా, గోటిలగుట్ట తండా మాచేపల్లి నుంచి సీతారాంకుంట తండా వరకు 3.8కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.2.65కోట్లు, సదాశివపేట మండలం ఆత్మకూర్ నుంచి వయా బొబ్బిలిగామ, ఏటిగడ్డ సంగం, మలాపాడ్ గ్రామాల మీదుగా సింగూర్ ప్రాజెక్టు వరకు 7.5కిలోమీటర్ల రోడ్డుకు రూ.5.2కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.